క్లుప్తంగా

దుప్పట్లు అందజేత

జనగామ రూరల్ : మకర సంక్రాంతి పర్వదినం, అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం సందర్భంగా అయ్యప్పభక్తుడు గజ్జి శంకర్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 20 వార్డు, స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలోని 20 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

చిల్పూరు: మండల కేంద్రంలో ముఖ్యకూడళ్లలో ఏడు హైమాస్ట్ లైట్లను వేయిస్తున్నట్లు ఎంపీపీ సరితబాలరాజు తెలిపారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో లైట్లకోసం స్తంభాలు వేసే కార్యక్రమాన్ని ఉపసర్పంచ్ పిట్టల మహేందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ త్వరలో లైట్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వారి వెంట నాయకులు మాచర్ల ప్రవీణ్, ఆవుల లింగయ్య, గనగోని రమేష్, పొన్నం శ్రీను, మహ్మద్ షకీల్, వెంకన్న, రాజు, రాజయ్య, శివరాత్రి శేఖర్, ఉన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

పాలకుర్తి టౌన్: అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన కుశంగుల పద్మకు 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ మాట్లాడుతూ బమ్మెరకు చెందిన బత్తిని దేవేందర్ కుమార్తె శ్రీవర్శిని పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర వస్తువులను అందేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జీడి హరీష్, బీజేపీ నాయకులు దుంపల సంపత్, సోమేశ్వర్, శ్రీకాంత్ పాల్గన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



జనగామ రూరల్: జాతీయ యువజన వారోత్సవాల సందర్భంగా నెల్లుట్ల నర్సింహారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు నెల్లుట్ల ప్రీతం ఇచ్చిన క్రికెట్ కిట్లను శనివారం యువతకు అందజేశారు. మండలంలోని అడవికేశాపూర్, భాషానగర్, జనగామ పట్టణంలోని రఫ్తార్ సింగ్ టీంలకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ అందజేశారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంకోటి, మండల అధ్యక్షుడు మధు, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడిగా యాదగిరి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని విశ్వనాథపురం గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా కంజర్ల యాదగిరి ని నియమించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు యాదగిరి ఘన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యేకు, సహకరించిన జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖగట్టయ్య, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులకు ఆశీర్వచనం

జనగామ : పట్టణంలోని గుండ్లగడ్డ కాలనీకి చెందిన శంకర్, రేణుక దంపతుల మనువడు, మనువరాలు విఘ్నేష్ పటేల్, పార్వతిలకు భోగి పండుగను పురస్కరించుకుని రేగుపండ్లతో ఆశీర్వచనం అందించారు. రేగిపండ్లతో చిన్నారులకు దిష్టి తొలగిపోవడంతో పాటు ఆ నారాయణుడి అనుగ్రహం కలుగుతుందని పెద్దల ప్రగాఢ విశ్వాసం.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రఘునాథపల్లి: మండలకేంద్రంలోని పురాతన అటుకుల మిల్లులో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని చూసిన పలువురు యాచకుడిగా అని భావిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, శరీరం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేకుండా ఉందని తెలిపారు. మిల్లు సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పనిచేసే ఓ యువకుడు మూత్రవిసర్జన కోసం వెళ్లగా మిల్లులో నుంచి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ వీరేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి శ్రీరంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పవిత్ర ధనుర్మాసం చివరి రోజున పురస్కరించుకుని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో కల్యాణాన్ని శాస్త్రోయుక్తంగా పూజారుల వేదమంత్రాల మధ్య చేపట్టారు. అర్చకులు కలకోట రంగాచార్యులు, రామానుజచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల మధ్య గోదా రంగనాయకస్వామి కల్యాణం భక్తుల సమక్షంలో నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఏర్పాట్లను చేశారు. దేవాలయంలో పుష్ప అలంకరణను స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన రంగు శ్రీధర్–శ్రీలత, రాహుల్, కౌశిక్, యాదగిరి చేపట్టారు. అన్నదానాన్ని సిద్ధిపేటకు చెందిన తిప్పరబోయిన యాదగిరి–స్వాతి, ఉత్తం భిక్షపతి–పద్మ దంపతులు నిర్వహించారు.



జఫర్‌గఢ్ : రంగనాయక గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌లో రంగనాయక గోదాదేవి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదిక వద్దకు తీసుకవచ్చి కల్యాణాన్ని జరిపించారు. ఊరేగింపు చేపట్టారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో...

భోగి మంటలు.. బసవన్నల సందడి

దేవరుప్పుల : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఇంటింటా భోగసౌభాగ్యాలు కలగాలని శనివారం తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. మండల కేంద్రంతోపాటు ఊరూరా యువతులు ముగ్గులు వేయగా ఇంటింటా గంగిరెద్దుల సవ్వడితో భక్తులు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు.

రఘునాథపల్లి: భోగి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఆడపడుచుల రాకతో ఇంటిల్లిపాది సంబరాల్లో తేలియాడారు.

బచ్చన్నపేట : భోగి మంటలతో పండుగను ఘనంగా నిర్వహించుకున్న మండల ప్రజలు సంక్రాంతి వేడుకల్లో మునిగిపోయారు. మహిళలు ముగ్గులు వేయడం, పిండివంటలలో నిమగ్నమయ్యారు.

జఫర్‌గఢ్ : సంక్రాంతి పండుగను పురష్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో భోగి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే మహిళలు, చిన్నారులు తమ ఇండ్ల ముందు రంగు, రంగుల ముగ్గులతో ముస్తాబు చేశారు. ముగ్గుల మధ్య పేడతో తయారు చేసిన బొడ్డమ్మలను పెట్టి తమ సంప్రదాయాన్ని చాటారు. చిన్నారులు రంగు, రంగుల పతంగులను ఎగురవేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.



దేవరుప్పులలో గంగిరెద్దులకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పాలకుర్తిటౌన్‌లో..

పాలకుర్తి టౌన్: భోగి వేడుకలను మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు తల్లిదండ్రులు,పెద్దలు భోగిపండ్లు పోశారు.

బాధిత కుటుంబానికి ఎంపీపీ పరామర్శ



జనగామ రూరల్ : మండలంలోని చీటకోడూర్ గ్రామ రైతు కో ఆర్డినేటర్ ఎలబోయిన వెంకటేష్ తండ్రి రామస్వామి అనారోగ్యంతో మృతి చెందగా శనివారం ఎంపీపీ మేకల కళింగరాజు, మండల రైతు కో ఆర్డినేటర్ బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్, బోళ్ల సంపత్, ప్రశాంత్, కొమురయ్య, సలేంద్ర కొమురయ్య, బాల్నె ఉమాపతి, నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

క్రీడా ప్రాంగణం ప్రారంభం



తరిగొప్పుల: పల్లెప్రగతిలో భాగంగా మండలంలోని నర్సాపూర్‌లో నిర్మించిన గ్రామీణ క్రీడాప్రాంగణాన్ని సర్పంచ్ బెల్లపు రాజు శనివారం ప్రారంభించారు. అనంతరం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బాషబోయిన కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఉపసర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ తుపాకుల మంగ, సమ్మయ్య, ప్రభాకర్, సురేష్, సత్తయ్య, కిష్టయ్య, పభాకర్, పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా కేసీఆర్ పథకాలు



చెక్కు అందజేస్తున్న కిరణ్‌కుమార్

నర్మెట : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా పేదలకు లబ్ధి చేకూర్చుతున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని మచ్చుపహాడ్‌కు చెందిన కొమురవెల్లి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ గొల్లపల్లి కుమారస్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందగా మంజూరైన రూ. 1.75 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సర్పంచ్ రామిని శివరాజ్ గుప్తాతో కలసి కిరణ్‌కుమార్ శనివారం అందజేశారు. ఉపసర్పంచ్ కొంపెల్లి రాజు, నాయకులు మురళి, వెంకటరత్నం, అంజయ్య, రాజు, రాజశేఖర్, పర్వతాలు, రాజు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం

నర్మెట : ఖండాంతరాలకు వ్యాప్తి చెందిన మన సంస్కృతీ సంప్రదాయాలను, వారసత్వపు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పీఏసీఎస్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని నెస్కో ఆధ్వర్యంలో మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను సతీమణి సరితతో కలిసి ప్రారంభించారు.కార్యక్రమంలో సంధ్యారాణి, స్వరూప, కళ్యాణి, అంజలి, అనూష, మమత, గీత, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జనగామ: పట్టణంలోని వీవర్స్ కాలనీలో శనివారం జనగామ లయన్స్ క్లబ్ మిలీనియం ఆధ్వర్యంలో లయన్ కోడం శ్రీనివాస్, బొంతపల్లి నాగరాజు నిర్వహణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఐసీఎఫ్ కోఆర్డినేటర్ శ్రీరాం శ్రీనివాస్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దాసరి సుమన్, కోడం అన్నపూర్ణ, శ్రీరాం సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి చల్లా గీతారెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారపాక రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: నీర్మాలలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నర్మెట: మండలంలోని మల్కపేటలో నవతరం యూత్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను సర్పంచ్ రజితా రవితో కలిసి ఎంపీపి తేజావత్ గోవర్ధన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి గౌస్, మహేందర్, పరశురాములు, కృష్ణ, రామన్, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల : మండలంలోని నర్సాపూర్‌లో భార్గవి, ప్రసాద్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెల్లం రాజు, జెడ్పీటీసీ ముద్దసాని పద్మజావెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ తుపాకుల మంగ తిరుమలేష్, ఎస్సై దూదిమెట్ల నరేష్, తెలంగాణ సీడ్స్ మాజీ డైరెక్టర్ అర్జుల సంపత్‌రెడ్డి, పాల్గొన్నారు.

దేవరుప్పుల : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని నీర్మాలలో ఎంపీటీసీ మేడ కళ్యాణివెంకటేష్‌ల ఆధ్వర్యంలో మేడ సుశీల– కొమురయ్య, మేడ రవి జ్ఞాపకార్థం ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎండీ.అన్వర్, పీఏసీఎస్, ఎంఎంసీ డైరెక్టర్లు కొత్త జలంధర్ రెడ్డి, నర్సింహులు, రైతు కోఆర్డినేటర్ దయాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు విద్యాసాగర్, మల్లారెడ్డి, పాల్గొన్నారు.



నర్మెట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



జనగామ : ముగ్గులు వేస్తున్న యువతులు



తరిగొప్పుల : విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ

క్రీడలు జీవితంలో భాగం కావాలి

- రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి



బచ్చన్నపేట : క్రీడలను ప్రారంభిస్తున్న రమణారెడ్డి



లింగాలఘణపురం: విజేతలకు బహుమతి అందజేస్తున్న అతిథులు

బచ్చన్నపేట: చిన్ననాటి నుంచే క్రీడల్లో మక్కువ పెంచుకోవాలని యువత జీవితంలో క్రీడలు భాగం కావాలని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి అన్నారు. మండలంలోని లింగంపల్లిలో రైతు సమన్వయ సమితి గ్రామశాఖ అధ్యక్షుడు మద్దికుంట రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడలను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, ఉపసర్పంచ్ భాస్కర్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు రమేష్, ఐలయ్య, భిక్షపతి, అజీం, జాన్ నర్సింహులు, కోఆప్షన్ సభ్యుడు సంతోష్, బాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, మహేష్, అబీబ్, కనుకయ్య, నవీన్, బాలరాజు, మధు పాల్గొన్నారు.

లింగాలఘణపురం : మండలంలోని నేలపోగులలో సర్పంచ్ దూసరి గణపతి ఆధ్వర్యంలో యువతకు సంక్రాంతి పర్వదినం సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొత్తం ఏడు టీంలు పాల్గొన్నాయి. నోముల సతీష్ టీంకు ప్రథమ బహుమతి రూ.2016లు, ద్వితీయ బహుమతి మైల మధు టీంకు రూ.1016లు అందించారు. కార్యక్రమంలో ప్రభాకర్, హరికృష్ణ, యాదగిరి పాల్గొన్నారు.

జనగామ రూరల్: పట్టణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 17వ వార్డులో కౌన్సిలర్ జక్కుల అనిత వేణుమాధవ్ ఆధ్వర్యంలో శనివారం యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వార్డులోని యువత కలిసి మెలిసి ఐక్యమత్యంగా ముందుకు సాగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో యువకులు కె కృష్ణ, కె రాజు, జయకృష్ణ, సాయి,శ్రీనివాస్, ప్రవీణ్, నరేష్, నవీన్, కిరణ్ పాల్గొన్నారు.



జనగామ రూరల్ : క్రీడల్లో పాల్గొన్న యువత

ఎక్కడి గుంతలు అక్కడే..

- ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసినా మారని తీరు..

తరిగొప్పుల : తెలంగాణకు ఫైబర్‌లో భాగంగా రహదారుల వెంబడి తీసిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే పూడ్చివేయాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సంబంధిత శాఖల అధికారులకు మండల సర్వసభ్య సమావేశం సాక్షిగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. మండలకేంద్రం నుంచి ఎన్యానాయక్ తండా వరకు జనగామ–హుస్నాబాద్ రహదారి వెంబడి తెలంగాణకు ఫైబర్‌లో భాగంగా తీసిన గుంతలు పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంపై ఈనెల 4న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ భూక్య జుంలాల్ నాయక్ విన్నవించారు. దీంతో సత్వరమే గుంతలను పూడ్చివేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కానీ నేటికి గుంతలను సదరు కాంట్రాక్టర్ పూడ్చివేయలేదు.



ప్రమాదకరంగా ఉన్న గుంతలు

గొల్లకురుమలు ఐకమత్యంగా ఉండాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



జనగామ రూరల్‌లో..

రఘునాథపల్లి: గొల్ల కురుమలు ఐక్యతగా ఉంటూ ముందుకు సాగాలని జీఎంపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుండా వెంకటయ్య, గద్దె రాజులు అన్నారు. మండలంలోని అశ్వరావుపల్లిలో గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో జీఎంపీఎస్ నాయకులు శనివారం నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేయాల్సిన సమయం ఆసన్నమైందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గాజుల రాములు, దండిగ రాములు, మల్లయ్య, సంపత్, సాంబరాజు, కొమురయ్య, కుమార్, స్వామి, రాజు, నాగరాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్ : తెలంగాణ వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఈఓ కె.రాము ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఘోర్సింగ్, ప్రధానకార్యదర్శి గంగిశెట్టి ప్రభాకర్, కోశాధికారి కొండా రవి, కిష్టయ్య, కిషన్, లచ్చిరాం, అశోక్, హనుమంతారావు పాల్గొన్నారు.

ఆలేటి ఎల్లమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ నాగిరెడ్డి

పాలకుర్తి: మండలంలోని బమ్మెర శివారులో ఈనెల 16 నిర్వహించే ఆలేటి ఎల్లమ్మ జాతర ఏర్పాట్లను శనివారం ఎంపీపీ నల్లా నాగిరెడ్డి సందర్శించి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను కోరారు. సర్పంచ్ నాగభూషణం, సత్యనారాయణ, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

పకడ్బందీగా ట్రాఫిక్ రూల్స్ అమలు

- నంబర్‌ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి
- లేకుంటే వాహనం సీజ్.. 420 కేసు నమోదు
- 17 నుంచి రంగంలోకి ప్రత్యేక తనిఖీలు

జనగామ: రోడ్డు ప్రమాదాల నివారణ.. వేగ నియంత్రణ.. ట్రాఫిక్ రూల్స్ క్రమబద్ధీకరణపై పోలీసులు దృష్టి సారించారు. సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో మోటారువె వెహికిల్ యాక్టు(ఎంవీ) నిబంధనల అమలుకు ఈనెల 17 నుంచి జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. ఇందుకు స్థానిక పోలీసులతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపనున్నారు. ఈ విషయమై నెల రోజులుగా ప్రచారం నిర్వహిస్తున్న పోలీసుశాఖ.. నిబంధనలు పాటించని వాహన చోదకులకు కళ్లెం వేసేందుకు సిద్ధమవుతోంది.

డీసీపీ సీతారాం పర్యవేక్షణలో..

జిల్లా వ్యాప్తంగా పి.సీతారాం పర్యవేక్షణలో ఏసీపీ, సీఐ, ఎస్సై, స్పెషల్ టీంలతో పాటు పోలీసు సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించడానికి సన్నద్ధం అవుతున్నారు. వరంగల్–హైదరాబాద్, విజయ వాడ–సిద్దిపేట జాతీయ రహదారులతో పాటు జనగామ–హుస్నాబాద్, మండలాలు, జిల్లా కేంద్రంలోని ప్రధాన జంక్షన్లు, గ్రామాల రహదారులు, పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా, నెహ్రూపార్కు, రైల్వేస్టేషన్, ఆర్అండ్‌బీ, వడ్లకొండ ఎక్స్‌రోడ్డు, హెడ్‌పోస్టాఫీస్, ఆయా వార్డుల పరిధి ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టనున్నారు. ఎవరూ తప్పించుకునే వీలు లేకుండా పోలీసులు జిగ్‌జాగ్ పద్ధతిలో తనిఖీలు చేయనున్నారు. ఏదో రకంగా నిబంధనలు పాటించని వాహన చోదకులు తప్పించుకున్నా.. అందు బాటులో ఉన్న సీసీ కెమెరాల పుటేజీల సహాయంతో పట్టేస్తారు.

నిబంధనలు పాటించకుంటే..

వాహనం నడిపించే క్రమంలో డ్రైవింగ్ లైసెన్స్, వెహికిల్ నంబర్‌ప్లేట్(క్లియర్‌గా కనిపించాలి), ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫిట్‌నెస్ తదితర ఎంవీ యాక్టు నిబంధనలు పాటించాలి. ఇందులో ఏ ఒక్కటి లేకున్నా శిక్ష తప్పదు. ముఖ్యంగా నంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే వాహనం సీజ్ చేయడంతో పాటు 420 సెక్షన్ కింద కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తారు. పనిలో పనిగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు కూడా నిర్వహించున్నారు.

> **నిబంధనలు పాటించాల్సిందే..**
>
> 
>
> పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా 20 ప్రత్యేక పోలీసు బృందాలతో ఈనెల 17 నుంచి వాహనాల తనిఖీ చేపడతాం. నిబంధనలు పాటించాల్సిందే. నంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇతరత్రా ఏమీ లేకున్నా వాహనం సీజ్ చేసి వ్యక్తిపై 420 సెక్షన్ కింద కేసు నమోదు చేస్తాం. వాహన డ్రైవర్లు, యజమానులు ఎంవీ యాక్టు ప్రకారం అన్నీ ఉన్నాయా లేదా అని చెక్‌చేసుకుని రోడ్డెక్కాలి.
>
> – పి.సీతారాం, వెస్ట్‌జోన్ డీసీపీ, జనగామ